పుడమి తల్లికి కడలి కోత

- నానాటికీ ముందుకొస్తున్న సముద్రం
- భయాందోళనలో తీర గ్రామాలు

మొగల్తూరు: రాష్ట్రంలో విస్తారమైన తీర ప్రాంతం ఉంది. ముఖ్యంగా నరసాపురం నియోజకవర్గంలో సుమారు 19 కిలో మీటర్ల తీర ప్రాంతం ఉంటే అదే స్థాయిలో తీర ప్రాంతం కోతకు గురవడం విశేషం. ఇప్పటికే నరసాపురం మండలం చినమైనవానిలంక పూర్తిగా కోతకుగురైంది. రాష్ట్రంలోని కొన్నితీర ప్రాంతాల్లో నివాసాలు సముద్రంలో కలిసిపోతుంటే మరికొన్ని చోట్ల తీరప్రాంతం కోతకు గురవుతూ వస్తుంది.వాతావరణంలో మార్పులు, ప్రజల జీవన విధానాల కారణంగా తీర ప్రాంతంలో కోత తీవ్రత పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సముద్రంలో కొట్టుకు వస్తున్న తాటిబొండ్లుతో ప్రమాదకరం

ఎగువ ప్రాంతంలో తీర ప్రాంతం కోతకు గురవడంతో తాటి బొండ్లు కొట్టుకు రావడంతో పలువురు గాయాల పాలవుతున్నారు. అలల ఉధృతికి కొబ్బరి, తాటి బొండ్లు కొట్టుకొచ్చి పర్యాటకులను గాయాలు పాలు చేస్తున్నాయి. సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండటం, లేదా ఆటు పోటులకు నీటి లోపలి నుంచి వేగంగా వస్తున్న తాటి బొండ్లను గమనించక సముద్ర స్నానం చేస్తున్న సందర్శకులు తీవ్ర గాయాల పాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. గతంలో పేరుపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడిని వేగంగా వచ్చిన తాటిబొండు కాలును ఢీ కొనడంతో కాలు కాస్తా రెండు ముక్కలయ్యింది. మొగల్తూరుకు చెందిన గ్రామీణ వైద్యుడు కుటుంబ సభ్యులతో సముద్ర స్నానం చేస్తుండగా తాటి బొండు ఢీ కొనడంతో ఆసుపత్రి పాలయ్యాడు. కేపీ పాలెం బీచ్‌లో స్నానం చేసేందుకే ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో ఈ తాటి బొండు ఢీ కొనడంతో స్థానికులతో పాటు పర్యాటకులు భయాందోళనకు గురవుతున్నారు. కార్తీకమాసం 30 రోజులు పర్యాటకులు వేలాదిగా తరలి వస్తారు. వీరంతా సముద్ర స్నానానికి మొగ్గు చూపుతారు. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా అధికారులు బారికేడ్లను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తారు. అయితే అధికారులు, స్థానిక నాయకులు చొరవ తీసుకుని తీరంలోని తాటిబొండ్లను, నీటిలో కొట్టు కొస్తున్న వాటిని ఎప్పటికప్పుడు తొలగించడంతో ప్రమాదాలను నివారించగలిగారు.



కేపీపాలెం సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన తాటి బొండ్లు (ఫైల్)



కెపిపాలెంలో కోతకు గురవుతున్న తీరం

కెరటాలు, తుఫాన్ల తీవ్రత పెరిగింది

గతంలో కన్నా కెరటాల తీవ్రత పెరగడంతో పాటు వాతావరణంలో మార్పులు కారణంగా తుఫాన్లు పెరిగాయి. దీంతో అలల ఉధృతికి కెరటాల తీవ్రత పెరిగి తీరం కోతకు గురవుతుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. గతంలో నియోజకవర్గంలో కోతకు గురవుతున్న ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ అధికారులు పర్యటించి వెళ్ళారు.తీరం కోతపై అధ్యయనం చేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అలల ఉధృతి పెరిగింది



గతంలో కన్నా ప్రస్తుతం అలల ఉధృతి పెరిగింది. వేగంగా వస్తున్న అలల ఉధృతుకి తీర ప్రాంతం కొరతకు గురవుతుంది. దీంతో గతంలో కన్నా సముద్రం రోజురోజుకు ముందుకు వస్తుంది. ఈగోతులు, గొప్పులు తెలియక ప్రమాదాలకు గురువుతున్నారు.

కర్రి ఏసుబాబు, పేరుపాలెం సౌత్

గతంలో తాటి బొండ్లు కొట్టుకొచ్చేవి



ఎగువ ప్రాంతం నుండి కొట్టుకు వచ్చే దుంగలు, తాటిబొండ్లు తగలి గాయాలుపాలయ్యేవారు. ప్రస్తుతం అటువంటివి ఏమీ లేక పోయినా తీర ప్రాంతం రోజురోజుకు కోతకు గురవడం ఆందోళన కలిగిస్తుంది. గతంలో సముద్ర తీరప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ అధికారుల పర్యటించి వెళ్ళారు. అయితే సముద్రం కోతకు గురువకుండా ఏమి చర్యలు తీసుకున్నారో తెలియదు.

శంకరపు శ్రీనివాసరావు, పేరుపాలెం సౌత్

నేడు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో స్కూల్ విద్యార్థులకు బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చిత్రకారుడు ఎం.ఉదయ్ కుమార్ తెలిపారు. స్థానిక లజపతిరాయ్ పేట, క్షత్రియ కల్యాణ మండపం వద్ద శాంతి నివాస్‌లో 18వ తేది బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ చిత్ర కళా విశారదులు, డ్రాయింగ్ మాస్టారు మార్ల పూడి ఇజ్రాయేలు శత జయంతి వేడుకల సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు మూర్తి 9989190909, మహేష్ 8247013616, బాలు 9948231221 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

యలమంచిలి: రానున్న రెండు రోజులు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రైతులు మూడు రోజులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఏవో చిందులూరి దేవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సార్వా పంటలో వరి 4412 ఎకరాల్లో సాగు చేయగా ఇంత వరకు 1480 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని ఆమె తెలిపారు. ఇంత వరకు 2974 మెట్రిక్ టన్నుల ధాన్యం (37 శాతం) రైతుసేవా కేంద్రాల ద్వారా రైస్ మిల్లులకు తరలించామన్నారు. కళ్లాల్లో ధాన్యం ఉన్నట్లయితే వెంటనే సురక్షిత ప్రాంతంలో వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి నిత్యాన్నదానం నిమిత్తం దాత కోయ జయ వెంకట రామారావు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయ కార్య నిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావుకు దాతలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

మొగల్తూరు: చేపల మార్కెట్ వీధిలో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం 42వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచరాత్రి ఉత్సవాలు, సహస్ర నామ అష్టోతర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు గ్రామంలోని భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

‘పది’ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పదో తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్‌లో ముద్రించిన పాఠ్యాంశాలను బాగా చదివి అత్యుత్తమ మార్కులు సాధించాలని హెచ్ఎం కోట శ్రీనివాసరావు కోరారు. దిగమర్రు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం యూటీఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను బండి రాధాకృష్ణ సౌజన్యంతో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్, పద్మశ్రీదేవి, పద్మావతి, రాజేశ్వరి, హెప్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

యలమంచిలి: విద్యుత్‌ను పొదుపు చేయడమంటే విద్యుత్ ఉత్పత్తి చేయడంతో సమానమని ఎలక్ట్రికల్ ఏడీ వెంకట్రావు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యుత్ ప్రాధాన్యతను వివరిస్తూ మంగళవారం ఆయన ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది మేడపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలను వాడడం ద్వారా విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి, భవిష్యత్తు తరాల వారికి పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి అందించడానికి విద్యుత్ పొదుపు ఒక మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఈ దున్న రాజీవ్, లైన్ ఇన్‌స్పెక్టర్లు రాజు, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్లేస్‌మెంట్ డ్రైవ్

నరసాపురం: స్థానిక వైఎన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19వ తేదీన ఏపీఎస్ఎస్‌డీసీ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ప్లేస్మెట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.కోకమాన్ తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో హెట్రో ఫార్మా, ముత్తూట్ ఫిన్‌కార్ప్ సంస్థలు ఉద్యోగాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. 18–30 సంవత్సరాల లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 95020 24765ను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ డీఈ

మొగల్తూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చేపట్టిన అంతర్గత రహదారుల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని పీఆర్ డీఈ డి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లో చేపట్టిన రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి రూ.3 కోట్ల 5 లక్షలతో 27 సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ త్రిశూల పాణి, ఏఈఈ వెంకటేశ్వర రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ జనాభా గణన నిర్వహించాలి



జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన మాలల ఐక్య వేదిక నాయకులు

నరసాపురం: రాష్ట్రంలో ఎస్సీ జనాభా గణన కూలంకషంగా నిర్వహించాలని నరసాపురం మాలల ఐక్య వేదిక కన్వీనర్ సోడదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీధర్ ఆధ్వర్యంలో మాలల ఐక్య వేదిక నాయకులు విజయవాడలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కిషోర్ మక్వానాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ జనాభాతో పాటు ఎస్సీ ఉపకులాల గణన కూడా చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణను ఆపాలన్నారు. ఎస్సీ కులగణన పూర్తి స్థాయిలో జరగకుండా ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పునరాలోచన చేయాలని కొంత కాలంగా దేశ వ్యాప్తంగా పోరాటాలు కూడా చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మాలల ఐక్య వేదిక నాయకులు దొండపాటి స్వాములు, కిరణ్, వర్ధనపు సుధాకర్, చొప్పల జగదీష్, టి.సురేష్, సోడదాసి జైపాల్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించండి



శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు

నరసాపురం రూరల్: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ శాఖల సిబ్బంది పని చేయాలని ఎంపీపీ మైలాబత్తుల సోని, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి పంచాయతీల్లో చేపట్టాల్సిన విధి విధానాల గురించి సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్, ఏపీఎం నాగభూషణ నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వినయ్‌కుమార్, తదితరులు శిక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

యలమంచిలి: గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మండలంలోని నేరేడుమిల్లి, పెనుమర్రు, కట్టుపాలెం, గుంపర్రు, శిరగాలపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.1.38 కోట్లతో చేస్తున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెన్మత్స వాణి, పొన్నమండ నాగరాజు, తుంగా అమూల్య, పైడి చంద్రపాల్ ఎంపీటీసీ సభ్యులు కవురు నాగమణి, తహసీల్దారు గ్రంధి నాగవెంకట పవన్‌కుమార్, ఎంపీడీఓ నంది పాటి ప్రేమాన్విత, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీటి సంఘ ఎన్నికలు



నీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్‌కు ఎన్నిక పత్రాలను అందిస్తున్న ఇరిగేషన్ అధికారులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు, మార్టేరు నీటి పంపిణీ సంఘ ఎన్నికలు మంగళవారం ఆయా సెక్షన్‌ల పరిధిలో నిర్వహించారు. మార్టేరు సెక్షన్ నీటి పంపిణీ సంఘం చైర్మన్‌గా జక్కంశెట్టి సత్యనారాయణ, వైస్‌చైర్మన్‌గా ఇంటి శ్రీరాముడు ఎన్నికయ్యారు. అలాగే పాలకొల్లు సెక్షన్ నీటి పంపిణీ సంఘ చైర్మన్‌గా పెన్మెత్స రామభద్రరాజు, వైస్ చైర్మన్‌గా దేవళ్ల రామకోటి ఎన్నికయ్యారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



పెనుగొండ: రైతుల అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



యలమంచిలి: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్

పెనుగొండ: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కని వేదికని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ ప్రజల నుంచి విజ్ఞాపనలను జిల్లా కలెక్టర్ స్వయంగా తీసుకుని, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి జనవరి 8 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెవెన్యూ సదస్సుల ద్వారా 56 సర్వీసులు ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. ప్రతీ అర్జీకి 33 రోజుల్లోగా పరిష్కారం లభిస్తుందని ఆమె తెలియ చేశారు. గుమ్ములూరులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 27 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ తెలిపారు. కార్యక్రమంలో నర్సాపురం ఆర్డీవో దాసి రాజు, ఆచంట తహసిల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో వి.పూర్ణ బాబ్జి, గ్రామ సర్పంచ్ జక్కం శెట్టి చంటి, సబ్ రిజిస్ట్రార్ కె.వెంకటపతిరావు, సెక్రటరీ పి.చంద్రశేఖరరావు, ఎంఈఓ పి.రాజేంద్రప్రసాద్, డీటీలు కష్టారావు, రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు జి.లక్ష్మి, వి.పద్మ, ఎంపీపీలు సూర్యకుమారి, నాగరాజు, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు అన్నారు. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు సంబంధించి సర్వే సమస్యలు, పాస్ పుస్తకాలు తదితర సమస్యలకు సంబంధించి ఆర్జీలు అందజేయాలన్నారు. 16 మంది రైతులు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. అలాగే వరిధనంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 19 మంది రైతులు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, గ్రామ సర్పంచ్ యాండ్ర లక్ష్మీకుమారి, ఉప సర్పంచ్ యాండ్ర గోపి, నీటి సంఘం ఉపాధ్యక్షుడు పరువు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, వీఆర్వోలు చవ్వాకుల ఆదినారాయణ, గుబ్బల శ్రీనివాసరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో 53 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు వినియోగించుకోవాలన్నారు. రీసర్వే డీటీ జాషువా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కుమార్, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ ధనరాజ్, సర్పంచ్ నల్లి వరలక్ష్మిజేమ్స్, ఉపసర్పంచ్ అందే కవికుమార్, వీఆర్వో వినోద్, సర్వేయర్లు కొల్లాబత్తుల సెల్సీ, ధర్మవరపు క్రాంతి, భాస్కర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ కోరారు. మండలంలోని పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. పేరుపాలెం నార్త్‌లో 54 మంది రైతులు హాజరు కాగా 16 ఫిర్యాదులు, పేరుపాలెం సౌత్‌లో 60 మంది రైతులు హాజరు కాగా 22 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సేరుపాలెం వెంకన్న, తిరుమాని విజయలక్ష్మి, ఉపసర్పంచ్ చల్లా రామరాజు, ఎంపీటీసీ సభ్యులు, డీటీ సంధ్య, సర్వేయర్, దేవదాయ శాఖ ఈవో శ్రీనివాసరెడ్డి, మండల సర్వేయర్ ధన రాజ్, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: భూమి సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు మంచి మార్గమని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ అన్నారు. అబ్బిరాజుపాలెంలో నిర్వహించిన సదస్సులో 14 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం గ్రామ సర్పంచ్‌లు కామిశెట్టి సాయిబాబు, మల్లాడి ఉమామహేశ్వరి డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్, ఆర్ఐ యశోద, వీఆర్వోలు జయలక్ష్మి, శ్రీను, రమేష్, గ్రామ సర్వేయర్‌లు దామోదర్, ప్రతిభ, కళాంజలి తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు అర్బన్: సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో దాసి రాజు



మొగల్తూరు: పేరుపాలెం నార్త్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజకిశోర్



నరసాపురం రూరల్: కొప్పర్రులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

పెనుమంట్ర డీసీ చైర్మన్‌గా వెలగల బులిరామిరెడ్డి

పెనుమంట్ర: వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు మంగళవారం ఇరిగేషన్‌శాఖ కార్యాలయంలో నిర్వహించారు. పెనుమంట్ర సాగునీటి సంఘం అధ్యక్షుడు వెలగల బులి రామిరెడ్డి చైర్మన్‌గా, కొణితివాడ నీటి సంఘంఅధ్యక్షుడు మల్ల శ్రీరామమూర్తి వైస్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. మల్లిపూడి సంఘం అధ్యక్షుడు దాసు కనకదుర్గ ప్రసాద్, జుత్తిగ అధ్యక్షుడు కొవ్వూరి సోమ భాస్కరరెడ్డి, రాయకుదురు అధ్యక్షుడు తోట ఆదినారాయణ పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్లతో కలిసి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వడలి నీటి సంఘం అధ్యక్షుడు జక్కంశెట్టి సత్యనారాయణ చైర్మన్‌గా, శివదేవుని చిక్కాల అధ్యక్షుడు ఇంటి శ్రీరాములు వైస్ చైర్మన్‌గా ఎంపికయ్యారు.

ఆ రహదారి ప్రయాణం.. నరకప్రాయం



రహదారి మార్గంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

పెనుగొండ: పోడూరు మండలంలో మట్టపర్రు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి చాలా కాలంగా గ్రావెల్, మెటల్ రోడ్డుగానే ఉండడంతో రహదారిపై ప్రయాణం కష్టతరంగా మారిందని గ్రామస్తులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రహదారి ఎత్తు పల్లాలుగా ఉండడంతో పాటు లారీలు, బస్సులు, ట్రాక్టర్లు వంటి వాహనాలు వేగంగా వెళ్లినపుడు దుమ్ము లేచి వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులు, తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాలకొల్లు–మార్టేరు, పాలకొల్లు–ఆచంట స్టేట్ హైవేలను కలిపే ఈ రహదారి జెడ్పీ రహదారిగా ఉంది. గతంలో ఒకప్పుడు బీటీ రహదారిగా ఉండేది. చాలా కాలంగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో మెటల్ రోడ్డుగా ఉంది. గోతులతో ఉండడంతో మూడేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జెడ్పీ నిధులతో మరమ్మతులు చేశారు. పాలకొల్లు–మార్టేరు రహదారి నుంచి మట్టపర్రు గ్రామానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ మార్గంలో ఆటో సర్వీసులు, బస్సులు ఉండవు. ద్విచక్ర వాహనాలు లేని వారు చుట్టుపక్కల ఊళ్లకు వెళ్లి రావాలంటే పాలకొల్లు–మార్టేరు రోడ్డు వరకు నడిచి వెళ్లి అక్కడ నుంచి బస్సులు, ఆటోలకు వెళుతుంటారు. వర్షా కాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళ్లాలన్నా, అనేక అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రోడ్డుపై స్కూలు బస్సులు, కొబ్బరి లోడు ట్రాక్టర్లు ఎక్కువగా తిరుగుతుంటాయి. గోడౌన్‌లు కూడా ఉండడంతో ఒక్కోసారి ఈ రహదారిపై లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామంలో విద్యార్థులు పక్క గ్రామమైన జిన్నూరు జెడ్పీ హైస్కూలుకు సైకిళ్లపై వెళుతుంటారు. ఇప్పటికైనా ఈ రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కల్వర్టు నిర్మించాలి

మట్టపర్రు ప్రధానరహదారి మార్గంలో ముత్యాలమ్మ చెరువు వద్ద పంటబోదెపై గతంలో ఉన్న కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా ఉండడంతో మూడున్నరేళ్ల కిందట తూములు ఏర్పాటు చేశారు. భారీలోడు వాహనాలు, స్కూలుబస్సులు వెళ్లే ఈ మార్గంలో కల్వర్టు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నో ఏళ్లుగా అవస్థలు తప్పడం లేదు



మా గ్రామంలో ప్రధాన రహదారి దుస్థితి మరీ అధ్వానంగా మారింది. దీంతో ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం. అన్ని గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చెందుతున్నా ఇక్కడ మాత్రం తారు రోడ్డు వేయడం లేదు. వర్షా కాలంలో ప్రయాణం నరకంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉన్న కాలంలో రోడ్డుపై వెళ్లే వాహనాలతో దుమ్మురేగి ఇబ్బందులు తప్పడం లేదు. వీలైనంత త్వరగా తారురోడ్డు లేదా సిమెంటు రోడ్డు వేసి అభివృద్ధి చేయాలి.

– పెచ్చెట్టి ముత్యాలరావు, గ్రామస్తుడు

రహదారిని అభివృద్ధి చేయాలి



ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే చుట్టు పక్కల గ్రామాలకు రవాణా సదుపాయం ఎంతో మెరుగు పడుతుంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ముత్యాలమ్మ చెరువు వద్ద కల్వర్టు ప్రదేశంలో మలుపు ఉండడంతో పాటు రోడ్డు ఇరుకుగా ఉండడం లారీలు, స్కూల్ బస్సులు వెళ్లేటపుడు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. నూతనంగా కల్వర్టు నిర్మించి ర హదారిని విస్తరించాలి.

– కొల్లాబత్తుల రవికుమార్, గ్రామస్తుడు